

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి, మార్చి8: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల సందర్భంగా పరిగి మునిసిపల్ పరిధితో పాటు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ ఎండీ ఖాజా తెలిపారు. నేడు ఉదయం 11నుంచి ఒంటిగంట వరకు పరిగి మునిసిపాలిటీ, సుల్తాన్‌పూర్, లక్ష్మీదేవిపల్లి, నస్కల్, బర్కత్‌పల్లి, రుకుంపల్లి, బసిరెడ్డిపల్లి, రంగాపూర్, నజీరాబాద్, న్యామత్‌నగర్, మాదారం, పేట మాదారం గ్రామాల్లో సరఫరా ఉండదని, సహరించాలన్నారు.



కీసరగుట్టపై భక్తుల క్యూ



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఊరూవాడా, గుళ్లూ, గోపురాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివాలయాలకు వేలాది మంది భక్తులు పోటెత్తారు. వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వేకువ జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు. శివలింగాలకు అభిషేకాలు చేశారు. పూలు, పండ్లతో మంచెత్తారు. కీసరగుట్ట రామలింగేశ్వరాలయం, వికారాబాద్ బుగ్గరామలింగేశ్వర, తాండూరు మండలం అంతారం భూకైలాస్ ఆలయాల్లో రద్దీ నెలకొంది. ఉపవాసాలు ఉన్న భక్తులు సాయంత్రం స్వామి వారి దర్శన అనంతరం దీక్ష విరమించారు. రాత్రి వరకు పూజలు కొనసాగాయి.

శంభో.. శంకరా!

- ఉదయం నుంచి రాత్రి వరకు గుళ్ల వద్ద కోలాహలం
- స్వామి వారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- సాయంత్రం ఆలయాల వద్ద ఉపవాస దీక్షల విరమణ, రాత్రంతా జాగారం
- కీసరగుట్టలో ఆన్‌లైన్ దర్శన సేవలకు స్పందన నామమాత్రం..

మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో శివాలయాలకు భక్తుల తాకిడి

వికారాబాద్/మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కీసర, మార్చి8: వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని దేవాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. హరహర మహాదేవ అంటూ భక్తులు పరవశించిపోయారు. ఉదయం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు శివాలయాల్లో ఓంకార స్వరూపుడైన శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కీసరగుట్టకు భక్తజనం పోటెత్తింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయం నుంచే స్వామివారి దర్శించుకున్నేందుకు బారులు తీరారు. గురువారం రాత్రి స్వామివారి కల్యాణ అనంతరం గర్భాలయ ద్వారబంధనం చేసిన అనంతరం తెల్లవారు జామున 3.30 గంటలకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆలయ నిర్వహకులు గర్భాలయంలోని మూలవిరాట్‌కు మాఘ బహుళ త్రయోదశి ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, యాగశాలలో రుద్ర స్వాహకార హోమం నిర్వహించారు. సాయంత్రం ఉపవాస దీక్షల అనంతరం భక్తుల స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 10గంటలకు భజనలు, సంతతధారాభిషేకము పూజలు నిర్వహించారు.

అన్నదానాలు

కీసరగుట్టలో భక్తులకు పలు స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు అన్నదానాలు చేశారు. భక్తులతో పాటు విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి రెడ్డిసంక్షేమ, ఆర్యవైశ్య, వంశరాజ్, మున్నూరుకాపు సంఘాలు, మర్వాడీ మిత్ర మండలి అధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య నిత్యన్నదాన సత్రం నిర్వాహకులు వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులుల కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు ఏసీపీ నరేందర్ గౌడ్ వాటిని ప్రారంభించారు.

కనుల పండువగా స్వామివారి కల్యాణం

శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రవణ నక్షత్ర యుక్త తులలగ్నమందు ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబసభ్యులు స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదములు, ఆశీర్వచనలు అందజేశారు.



వికారాబాద్‌లోని బుగ్గరామలింగేశ్వరాయంలో భక్తులు

స్వామివారి సేవలో ప్రముఖులు

శివరాత్రి పురస్కరించుకొని పలువురు ప్రముఖులు కీసరగుట్ట రామలింగేశ్వరుడి దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కూమార్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారిలక్ష్మారెడ్డి, బీజేపీ సీనియర్ నాడుకు ఈటలరాజేందర్ దంపతులు, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం, న్యాయమూర్తులు, అధికారులు స్వామివారికిపూజలు నిర్వహించారు.

భక్తుల ఇబ్బందులు

శివరాత్రి రోజున కీసరగుట్టకు వచ్చినభక్తులకు అధికారులు చుక్కలు చూపించారు. వీఐపీ పాసుల దర్శనం క్యూలైన్, శీఘ్రదర్శనం (రూ.500టిక్కెట్) క్యూలెన్‌లో వచ్చే భక్తులు ముందుగా వేర్వేరులైన్లలో రాగా, కొద్ది దూరం వెళ్లాక ఒకే చోట కలిసిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది.





తాండూరు భూకైలాస్‌లో పల్లకీ సేవలో భక్తులు

శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

వికారాబాద్‌లోని బుగ్గ శ్రీరామలింగేశ్వరస్వామి, పులుసుమామిడిలోని పార్వతీ పరమేశ్వర, కులకచర్లమండలంలోని పాంబండ రామలింగేశ్వరస్వామి, పూడూరు మండలంలోని దామగుండం రామలింగేశ్వరస్వామి, నీళ్లపల్లి ఏకాంబరేశ్వరస్వామి, తాండూరు మండలం అంతారం భూకైలాస్, పాతతాండూరులోని కోటేశ్వర స్వామి, ఎల్లకొండలోని పార్వతీ పరమేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వికారాబాద్ సమీపంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో మాజీ ఎంపీకొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూడూరు మండలం, దామగుండం రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణితో కలిసి పూజలు నిర్వహించారు. తాండూరు మండలం, భూకైలాస్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం సభకు సర్వం సిద్ధం



44వ జాతీయ రహదారి పక్కన మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లు

- ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు.. కాంగ్రెస్ నేతలు.
- నేడు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

మేడ్చల్‌టౌన్, మార్చి 8: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో శనివారం జరగనున్న సీఎం సభకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా అధికార యంత్రాంగంతో పాటు పార్టీ నేతలు రెండు చోట్ల నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి సుచిత్ర వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. తర్వాత ఐటీహబ్ మైదానంలో జిల్లాలోని డ్వాక్రా సంఘాల సభ్యులతో ముఖాముఖిలో పాల్గొని వారి సమస్యలను తెలుసుకోవటం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. అనంతరం 44వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మైదానంలో నిర్వహిస్తున్న ప్రజాదీవెన సభలో సీఎం ప్రసంగించనున్నారు. కాగా, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్‌లతో పాటు నియోజకవర్గాల నేతలు శుక్రవారం సభల ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, సభా ప్రాంగణం వీఐపీ, మీడియా గ్యాలరీలు, పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభకు దాదాపు 50వేల మంది తరలిరానున్నట్లు తెలిపారు. సభకు వచ్చే జనానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పార్టీ నేతలు తెలిపారు.

సీఎం సమక్షంలో చేరికలు

ముఖ్యమంత్రి బహిరంగ సభలో జిల్లాకు చెందిన ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. వీరిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు అధికంగా ఉండటం గమనార్హం. మేడ్చల్ మండల శ్రీరంగవరం సర్పంచ్ విజయేందర్‌రెడ్డి, జడ్పీటీసీ శైలజతో పాటు, పలు మున్సిపాలిటీలు, మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులు సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. నియోజక వర్గం నేతలే కాకుండా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజ్‌గిరి తదితర ప్రాంతాలకు చెందిన నేతలు కాంగ్రెస్‌లో చేరనున్నారు.

మహిళలు స్వతహాగా ఎదిగినప్పుడే గుర్తింపు

మేడ్చల్‌టౌన్, మార్చి 8: మహిళలు స్వతహాగా ఎదిగిననాడే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని అడిషనల్ డీజీపీ, తెలంగాణ పోలీస్ అకాడమి ఆర్‌బీవీఆర్ఆర్, ఎఫ్ఏసీ వింగ్ డైరెక్టర్ అభిలాషబిశ్త్ అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని తెలంగాణ పోలీస్ ట్రేనింగ్ సెంటర్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. మహిళలు తాము ఎంచుకున్న రంగంలో ఎదగాలన్న పట్టుదల ఉండాలన్నారు. పట్టుదలతో ప్రారంభించిన పని మంచి గుర్తింపుతో పాటు లక్ష్యానికి చేరదీస్తుందన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. సమాజానికి సేవలందించటానికి పోలీసు రంగాన్ని ఎంచుకున్న మహిళలు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి గుర్తింపు పొందాలన్నారు. తమ శాఖలో ఉన్న మహిళలకు తనవంతు సాకారం ఎల్లవేళల ఉంటుందన్నారు. ప్రస్తుతం ట్రెనింగ్ పూర్తి చేసుకున్న వారు ప్రజాసేవ చేయటానికి బయట ప్రపంచంలో అడుగుపెట్టనున్నారని, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను వారు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. అనంతరం ట్రెనింగ్ సెంటర్‌లో ఆమె మొక్కలు నాటారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అడిషనల్ డీజీపీ అభిలాషబిశ్త్

తొలి జాబితాలో దక్కని చోటు

» కాంగ్రెస్ లిస్ట్‌పై ఉత్కంఠ » చివరి నిమిషంలో చేవెళ్ల పెండింగ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ అధిష్టానం విడుదల చేసింది. అయితే తొలి జాబితాలో ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలకు అవకాశం దక్కలేదు. వాస్తవానికి తొలి జాబితాలో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించాలని పార్టీ నాయకత్వం భావించింది. శుక్రవారం మధ్యాహ్నమే 39 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితా లీక్ అయ్యింది. ఇందులో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పేరు కూడా ఉంది. దీంతో సునీతారెడ్డి వర్గీయులు సంబరపడ్డారు. పార్టీలో చేరిన 20 రోజుల్లోనే టికెట్ లభించిందంటూ మీడియాలో కూడా విస్తృత ప్రచారం జరిగింది. అయితే సాయంత్రం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విడుదల చేసిన జాబితాలో చేవెళ్ల స్థానం కనిపించలేదు. ఈ జాబితాలో కొత్తగా మహబూబ్‌నగర్ స్థానం నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి పేరు ఖరారు చేశారు. సునీతారెడ్డి పేరు చివరి నిమిషంలో పెండింగ్‌లో పెట్టారు. రెండో జాబితాలో ఆమెకు స్థానం దక్కవచ్చని భావిస్తున్నారు. టికెట్ హామీతోనే మహేందర్‌రెడ్డి కుటుంబం ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరింది. ఇదిలా ఉంటే పార్లమెంట్ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ఆయా రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరు ఖరారు చేయగా మల్కాజిగిరికి మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేరు ప్రకటించింది. వీరిద్దరూ ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం వ్యూహాత్మకంగా క్షేత్రస్థాయిలో చేరికలను ముమ్మరం చేసింది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌లో చేరికలు పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో పటిష్ఠంగా ఉన్న బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల తరువాత డీలా పడింది. ఇపుడు ఆ పార్టీ నుంచి చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలకు ఎవరు పోటీ చేస్తారనేది ఇంకా గందరగోళంగానే ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు గతంలో తహతహలాడిన నేతలంతా ఇపుడు మౌనంగా ఉంటున్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపడం లేదు. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి వ్యవహారం పార్టీకి కూడా అంతు పట్టడం లేదు. ఆయన ఈ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపడం లేదని తెలిసింది. అలాగే మల్కాజిగిరి స్థానం నుంచి బరిలో దిగాలని భావించిన మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబ సభ్యులు కూడా మోహం చాటేస్తున్నారు. ఈపార్లమెంట్ ఎన్నికల్లో తమ కుటుంబం నుంచి ఎవరూ బీఆర్ఎస్ నుంచి పోటీ చేయడం లేదని మల్లారెడ్డి శుక్రవారం ప్రకటించడం గమనార్హం. ఇలా సీనియర్ నేతలంతా పోటీకి ఆసక్తి చూపకపోవడంతో బీఆర్ఎస్ నాయకత్వం ఆలోచనలో పడింది. జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, లేదా ఆయన తనయుడు వీరేష్‌ను మల్కాజిగిరి లేదా చేవెళ్ల నుంచి బరిలో దిగాలని బీఆర్ఎస్ నాయకత్వం కోరింది. అయితే పోటీపై వీరు కూడా తర్జనభర్జనలు పడుతున్నట్లు సమాచారం.

మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి అక్రమాలను బయటపెడతాం

» రూ.వందల కోట్లు ఇచ్చి మంత్రి పదవిని కొనుక్కున్న ఘనత మల్లారెడ్డిది
» కూల్చివేతలకు, సీఎంకు సంబంధం లేదు : కాంగ్రెస్ పార్టీ నేతలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మేడ్చల్ మార్చి8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మాజీ మంత్రి మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిల అక్రమాలన్ని బయటపెడతామని ఇది కేవలం శాంపిల్ మాత్రమేనని అసలు కథ ముందున్నదని మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో నేడు జరుగబోయే సీఎం బహిరంగ సభ వేదిక వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలోవారు మాట్లాడుతూ చిన్నదామర చెరువు ఎఫ్‌టీఎల్‌లో రాజశేఖర్‌రెడ్డి అక్రమ నిర్మాణాలు కట్టాడని, కూల్చివేయాలని 2011లోనే బీజేపీ, సీపీఎం, బీఆర్ఎస్ వాళ్ల ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు జేఏసీగా ఏర్పాటై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని వారు వివరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరుగుతున్నాయని, కూల్చివేతలకు సీఎంకు గాని ఎవ్వరికి గాని ఎటువంటి సంబంధం లేదన్నారు. గతంలో వందల కోట్లు ఇచ్చి మంత్రి పదవి కొనుక్కున్న ఘనత మల్లారెడ్డిదన్నారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా తప్పులు చేసి ఇప్పుడు సుద్దపూసలా మాట్లాడుతున్నారన్నారు. మల్లారెడ్డిని ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరనివ్వమని, పాలమ్మిన మల్లారెడ్డిని మళ్లీ అక్కడికే తీసుకెళ్తామన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

నేడు జరిగే సీఎం సభను విజవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. దాదాపు 50 వేల మందితో నిర్వహిస్తున్న సభకు మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని 7నియోజకవర్గాల పరిధి నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని వారు కోరారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంటుపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్

తాండూరు రూరల్, మార్చి 8 : ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి సహాయ సహకారాలతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని సంగెంకలాన్ మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్ అన్నారు. తాండూరు మండలం సంగెంకలాన్‌లో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.15లక్షలతో ఎస్సీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మిస్తామన్నారు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి సిద్ధు ఇంటి నుంచి పాఠశాల వరకు చేపట్టే సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సోమన్న, అమర్‌నాథ్‌గౌడ్, మునీర్, నర్సింహులు, బోనప్ప, ఎరుకల రాజు, హన్మంతు తదితరులున్నారు.

ప్రజాప్రతినిధులు ఎన్నికల నిబంధనలు పాటించాలి



కులకచర్లలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కులకచర్ల, మార్చి 8: ప్రజాప్రతినిధులు ఎన్నికల నిబంధనలు పాటించాలని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తహసీల్దార్ మురళీధర్ ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ప్రస్తుతం పాలమూరు ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ఎన్నికల కోడ్ కొనసాగుతుందనే విషయాన్ని గమనించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఫాంహౌస్‌లే ఫంక్షన్ హాళ్లు!

- దావత్‌లు ఫుల్.. పన్నులు నిల్!
- పేరుకు వ్యవసాయ క్షేత్రాలు.. జరిగేవి ఫంక్షన్లు
- అతిథులను బట్టి అద్దెల వసూలు
- రేయింబవళ్లు పార్టీలు.. జోరుగా వాణిజ్య కార్యకలాపాలు.. పట్టించుకోని అధికారులు



రాంపల్లి దాయరలోని ఓ ఫాంహౌస్

కీసర, మార్చి 8 : ఫాంహౌస్‌లు ఫంక్షన్ హాళ్లుగా మారాయి. పేరుకు ఫాం హౌస్‌లుగా చెలామణి చేస్తూ వాటిని ప్రైవేట్ ఫంక్షన్లకు అద్దెకిస్తున్నారు. అతిథుల సంఖ్యను బట్టి ఈవెంట్లకు ఫాంహౌస్ ఓనర్లు అద్దె వసూలు చేస్తున్నారు. దావత్‌లు చేసుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇష్టానుసారం మందు పార్టీలు చేసుకుంటున్నారు. అనుమతులు లేకున్నా డీజే మోతలతో రచ్చ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చేరువలో ఉండటంతో కీసర మండలం దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్ దెబ్బకు శివారు ప్రాంత కీసర, రాంపల్లి దాయర, గోధుమకుంట, చీర్యాల్, నర్సంపల్లి, యాద్గార్‌పల్లి, తిమ్మాయిపల్లి, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో గల వ్యవసాయ క్షేత్రాల్లో విపరీతంగా ఫాంహౌస్‌లు వెలిశాయి. నగరంలోని సంపన్నులు కుటుంబసమేతంగా వీకెండ్‌లో సేదతీరేందుకు ఫాంహౌస్‌లకు చేరుకుంటున్నారు. మరి కొందరు వ్యవసాయ క్షేత్రాల్లో ఫాం హౌస్‌లు నిర్మించి శుభకార్యాలకు అద్దెకిస్తూ, లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఈ మేరకు యజమానులు అక్కడ స్టార్ హోటళ్లలో ఉండేలా గదులు, స్విమ్మింగ్ పూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. శుభాకార్యాలు నిర్వహించేందుకు గార్డెన్లను తీర్చిదిద్దుతున్నారు. మద్యం పార్టీలు చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, డీజేలు పెట్టి డ్యాన్సులు చేసేందుకు ప్రత్యేకంగా వేదికలు ఏర్పాటు చేసి లక్షల్లో సంపాదిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు గానీ, పోలీసులు గానీ, ఆబ్కారీ శాఖ అధికారులు గానీ ఫాంహౌస్‌ల వైపు కన్నెత్తి చూడడం లేదు. అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం అక్కడ జరిగే కార్యకలాపాలపై ఆరా తీయడమూ లేదు. దీంతో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఫాం హౌస్‌లలో ఇంత జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ తతంగం అంతా వారికి తెలిసే జరుగుతుందా? అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

పేరుకే ఫాంహౌస్‌లు..

ఫాంహౌస్‌లు నిర్వాహకుల దందా మామూలుగా లేదు. పేరుకేమో ఫాంహౌస్‌లు.. చేసేది మొత్తం వ్యాపారమే. బర్త్‌డే పార్టీలకు, పెళ్లిళ్లకు, డిన్నర్లకు, వస్త్రాలంకరణ కార్యక్రమాలు, డోలారోహణం.. ఇలా ఫంక్షన్ హాళ్లలో జరిగే కార్యక్రమాలన్నీ అనుమతులు లేని ఫాంహౌస్‌లలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ నిర్వహించే పార్టీలకు వచ్చే వారి సంఖ్యను బట్టి రేటు ఫిక్స్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఫాంహౌస్‌లలో జరుగుతున్న శుభాకార్యాల వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం గండిపడుతోంది. ఇక్కడ నిర్వహించే ఈవెంట్లు, శుభకార్యాలకు.. 50 మంది లోపు ఉంటే రూ.20 నుంచి రూ.30వేలు, 50 నుంచి 100 మందికి ఉంటే రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు. అలాగే 100కుపైన ఉంటే దాదాపు రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఈ మేరకు రెండు, మూడు బెడ్ రూంలు, డైనింగ్ హాల్, స్విమ్మింగ్ పూల్స్‌తో పాటు శుభాకార్యాలు చేసుకునేందుకు ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేస్తున్నారు. పొలాల్లో కట్టడాలు కట్టి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న ఫాంహౌస్‌ల నిర్వాహకులు మాత్రం ప్రభుత్వానికి నయాపైసా కూడా పన్ను చెల్లించడం లేదు. ఎందుకంటే పంచాయతీ అధికారులను, ఆబ్కారీ, పోలీస్



ఓ ఫాంహౌస్‌లో నిర్మించిన స్విమ్మింగ్ పూల్

అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ పన్నులకు గండి కొడుతున్నారు. అలాగే ఫాంహౌస్‌లలో నిర్మించిన నిర్మాణాలకు అనుమతులేవీ లేవు. అన్నీ అక్రమ నిర్మాణాలే.. నిర్మించిన భవనాలకు అనుమతులు తీసుకొని ఉంటే చలాన్ల రూపంలో ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వచ్చేది. నిర్మించిన భవనాలకు అసెస్‌మెంట్ చేసి ఉంటే ప్రతీ సంవత్సరం పన్ను రూపంలో పంచాయతీకి ఆదాయం వచ్చేది. ఇవేమీ పట్టించుకోకుండా ఫాంహౌస్‌ల నిర్వాహకులు నెల నెలా ఇచ్చే ముడుపులకు ఆశపడి పంచాయతీ అధికారులు అటువైపు కన్నెతి చూడటం లేదు. స్థానిక గ్రామ పంచాయతీ అధికారులే అవినీతికి పాల్పడ్డారని అనుకుంటే పొరపాటే! మండల, జిల్లా స్థాయి అధికారులు కూడా ఇలాంటి ఫాంహౌస్‌లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇలానే కొనసాగితే పుట్టగొడుగుల్లా ఫాంహౌస్‌లు వెలిసి ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లే అవకాశం లేకపోలేదు.

విచ్చలవిడిగా మందు పార్టీలు!

ఫాంహౌస్‌లలో మద్యం ఏరులై పారుతోంది. నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఫాంహౌస్ నిర్వాహకులు దావత్‌లలో అతిథులు మద్యం సేవించేందుకు అనుమతి ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఉండి, పంచాయతీ కానీ, మున్సిపల్ కానీ సంబంధిత ప్రభుత్వ కార్యాలయం అనుమతి పొందిన ఫంక్షన్ హాళ్లలో మాత్రమే సాయంత్రం 5గంటల నుంచి రాత్రి పదిన్నర లేదా పదకొండు గంటల వరకు మాత్రమే అబ్కారీ శాఖ అధికారులు మద్యం పార్టీలకు అనుమతిస్తారు. దీనికి ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం బహిరంగ ప్రదేశాల్లో, ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగడం చట్టరీత్యా నేరం. ఇదంతా కళ్ల ముందే జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. మామూళ్లకు అలవాటు పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డీజేల మోత.. డ్యాన్సులతో ఉర్రూతలు

ఫాంహౌస్‌లలో డీజేల సౌండ్లు మోగిస్తూ డ్యాన్సులతో ఉర్రూతలూగడం సాధారణమైంది. హై మాస్ట్ లైట్లు, పవర్ క్రేన్లతో, స్మోక్ దావత్‌లు సర్వసాధారణమైంది. సాయంత్రం మొదలుకొని తెల్లవారుజాము వరకు పార్టీలు, ఫంక్షన్లు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఫాంహౌస్‌లలో అసాంఘిక కాక్యకలాపాలు కూడా జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఎస్వోటీ పోలీసులు ఓ కన్నేసి దాడులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పార్టీలు జరుగుతున్న ఫాంహౌస్‌లపై, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దీక్ష భక్తులకు పండ్లు పంపిణీ చేసిన ముస్లిం



ఉపవాస దీక్షలు చేపట్టిన వారికి పండ్లు పంపిణీ చేస్తున్న ఖుద్దూస్

కులకచర్ల, మార్చి 8: ఓ ముస్లిం వ్యక్తి తన సోదరభావాన్ని చాటుకున్నాడు. శివరాత్రి ఉపవాస దీక్ష చేసిన భక్తులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశాడు. బండవెల్కిచర్లకు చెందిన ఖుద్దూస్ కులకచర్లలో ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. శివరాత్రి సందర్భంగా పండ్లు పంపిణీ చేసి తన సేవానిరతిని చాటుకున్నాడు.

పచ్చళ్ల తయారీలో మహిళలకు ఉచిత శిక్షణ

వికారాబాద్, మార్చి 8: మహిళలకు పచ్చళ్లు, కారం పొడులు, తృణ ధాన్యాలతో స్నాక్స్ తయారీపై శిక్షణ ఇస్తామని యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ స్వర్ణ భారత్ ట్రస్ట్ సంస్థ సంచాలకులు కృష్ణ శుక్రవారం తెలిపారు. మార్చి 11 నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, 19ఏళ్ల నుంచి 45సంవత్సరాల్లోపు మహిళలు శిక్షణకు రావొచ్చని తెలిపారు. పది రోజులు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. రేషన్/ఆధార్ కార్డు, పాస్ పోర్ట సైజు ఫొటోలు, అన్ని రకాల జిరాక్స్ కాపీలు తెచ్చుకోవాలన్నారు. ఫుడ్ ప్రొడక్ట్స్ తయారీలో కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకం స్కీములను శిక్షకులకు వర్తింపజేస్తామన్నారు. పీఎంఎఫ్ఎంఈ కింద 35శాతం దాకా సబ్సిడీ లోను ఇప్పించగలుగుతామని, మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అన్ని రకాలుగా చేయూతనిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్, భోజన వసతులు, యూనిఫాం కల్పిస్తామన్నారు. వివరాలకు 9391487797, 9177141712, 9618534720, 6301890681 నబర్లలో సంప్రదించాలన్నారు.

తాండూర్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



తాండూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, జవాన్‌లు

తాండూరు, మార్చి 8 : త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా, వారిలో విశ్వాసాన్ని పెంపొందించే చర్యల్లో భాగంగా శుక్రవారం తాండూరులో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి తాండూరులో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివ మహిమ సృష్టికి రూపం

- చిలుకూరు ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్
- మొయినాబాద్‌లో వైభవంగా శివరాత్రి వేడుకలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్ రూరల్, మార్చి 8: ప్రపంచాన్ని నిర్వహించే పరమ చైతన్యాన్ని 'జ్యోతి'గా వేదం వర్ణించిందని.. సూర్య నక్షత్రాదులకూ ప్రకాశ స్వరూపం శివ మహిమ అని, శివారాధనతో దేవతలు మనకు అండగా నిలుస్తారని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ అన్నారు. శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బాలాజీ ఆలయ ఆవరణలోని సుందరేశ్వరాలయంలోని శివలింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ నెలా వచ్చే బహుళ చతుర్దశి 'మాస శివరాత్రు'లు శివధ్యాన, అర్చన, అభిషేక క్రియలకు ప్రశస్తమన్నారు. ఆ క్రమంలో మాఘమాసంలోని కృష్ణపక్ష చతుర్దశి నాటి మాస శివరాత్రే 'మహా శివరాత్రి' అని వివరించారు. శివరాత్రికి చేసే వ్రతం సంవత్సరకాల శివారాధనఫలాన్ని ఇస్తుందని శైవ శాస్త్రాలు చాటుతున్నాయని గుర్తుచేశారు. ఉపవాస, జాగరణలతో స్వయంగా శివలింగార్చన చేసుకోవడం,ఆలయాల్లో శివదర్శనం విశేష ఫలప్రదాలను అందిస్తుందని తెలిపారు. అలాగే హిమాయత్ నగర్ చౌరస్తాలోని లోటస్ టెంపుల్, ఎన్కెపల్లి శివాలయం, కనకమామిడిలోని ప్రసిద్ధ సంఘమేశ్వరాలయం, మొయినాబాద్‌లోని శివాలయలకు భక్తులు ఉదయం నుంచే వచ్చి దర్శనాలు చేసుకున్నారు. ఉపవాసం ఉన్న భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆయా ఆలయాల వద్ద ఉపవాస దీక్షలను విరమించుకున్నారు. ఇదిలా ఉంటే ఎన్కెపల్లికి చెందిన అల్లం హరీష్‌గౌడ్-స్వాతి దంపతులకు నెల క్రితం ఇదే రోజు ఆడబిడ్డ శ్రేష్ఠ జన్మించిన సందర్భంగా ఆమెను కుటుంబ సభ్యులు పరమశివుడి వేషధారణతో ప్రత్యేకంగా అలంకరించారు. చూపురులకు ఆ శిశువు కనువిందు చేసింది.



ప్రత్యేక అలంకరణలో కనకమామిడిలోని సంగమేశ్వరాలయ శివలింగం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఆమనగల్లు, మార్చి 8 : పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాల 30వ వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహమూద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు మాట్లాడుతూ 1993 నుంచి తమ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల డైరెక్టర్లు శివలింగం, ఫౌండర్ ఏ.వి శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా శరత్‌చంద్రారెడ్డి



ఘట్‌కేసర్ రూరల్, మార్చి 8 : రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడిగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి నియమితులయ్యారు. పీసీబీ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతకుమారిని నియమించగా, స్థానిక సంస్థల ప్రతినిధుల నుంచి సభ్యునిగా జెడ్పీ చైర్మన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పీసీబీ సభ్యులుగా 15 మందిని నియమించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పీసీబీ మండలి సభ్యుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

జవాన్ అయినా జేబు తడపాల్సిందే!

- భూమి పత్రాలిచ్చేందుకు ఆర్మీ జవాన్ నుంచి అమ్యామ్యా తీసుకున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది
- వీడియో చిత్రీకరణ చేసి వెలుగులోకి తెచ్చిన సైనికుడు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం

షాద్‌నగర్/కొందుర్గు, మార్చి 8 : అతడు సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం తెగించి పోరాడే సైనికుడు. అయినా తన భూమి పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయంలో రెండు నెలలుగా పోరాడి ఓడిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. తన భూమి పత్రాల కోసం లంచాలు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడిందంటూ అతడు చిత్రీకరించిన వీడియోలో ఆవేదన వ్యక్తం చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగు చూపింది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి అనే సైనికుడు కొద్ది నెలల క్రితం సెలవులపై స్వగ్రామం వచ్చాడు. కొందుర్గులో తనకున్న ప్లాట్‌లో ఇల్లు నిర్మించుకునేందుకు లోన్ కోసం బ్యాంకును సంప్రదించాడు. గ్రామంలో తన పేరిట ఉన్న మూడున్నర ఎకరాలపై లోన్ తీసుకోవాలనుకున్నాడు. ఇందుకు 1954 నుంచి 2010 వరకు పహాణీలు, ఆర్ ఓఆర్ పత్రాలు కావాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. కార్యాలయ రికార్డు అసిస్టెంట్ బాలరాజు, హేమంత్ అనే వారిని సంప్రదించాడు. భూమి పత్రాలు ఇవ్వాలంటే తనను వారు రూ.30వేలు లంచం డిమాండ్ చేశారని అశోక్‌రెడ్డి తన వీడియోలో పేర్కొన్నాడు. తాను సైనికుడినని, తన వద్ద కూడా డబ్బులు వసూలు చేయడం సరికాదని వారితో అన్నా వారు పట్టించుకోలేదన్నాడు. ఈ విషయంపై తాను తహసీల్దార్‌తో మాట్లాడుతానని చెప్పినా విన్పించుకోలేదని వీడియోలో తెలిపాడు. తాము అధికారికి కూడా కొంత ముట్టచెప్పాల్సి ఉంటుందని, డబ్బులిస్తేనే పత్రాలిస్తామని కార్యాలయ సిబ్బంది మొండికేసినట్టు అశోక్‌రెడ్డి తెలిపాడు. దీంతో తాను మొదట రూ.10వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించానన్నాడు. తనకు సెలవులు ముగుస్తున్నందున విధిలేని పరిస్థితిలో మిగితా రూ.20వేలు కూడా చెల్లిస్తూ తన ఫోన్‌లో ఈ తతంగాన్ని మొత్తం వీడియో చిత్రీకరణ చేశాడు. 'ఈ అవినీతిని తాను అప్పుడే మీడియా దృష్టికి తేవాలనుకున్నా. కానీ మీడియాకు తెలిస్తే తన పత్రాలు ఇవ్వరేమో అనే భయంతో విలేకరులకు చెప్పలేదు.' అని జవాన్ అన్నాడు. తాను డ్యూటీలో చేరిన తర్వాత ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు. తాము దేశ సరిహద్దులో దేశ రక్షణ కోసం సేవ చేస్తోంటే తమను కూడా లంచాలు అడగడం బాధాకరం అని అశోక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా కార్యాలయ సిబ్బంది జవాన్‌ను లంచం అడిగిన తీరుపై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

దీని గురించి నాకు తెలియదు : రమేష్‌కుమార్, తహసీల్దార్

కాగా ఈ విషయం గురించి తనకు తెలియదని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. తాను కొన్ని రోజులుగా 58, 59 జీవోలకు సంబంధించిన సర్వే పనుల్లో బిజీగా ఉన్నానన్నారు. అలాగే కొన్ని రోజుల క్రితం తన సోదరుడు మరణించడంతో కొన్ని రోజులు సెలవుపెట్టానన్నారు. సర్టిఫికెట్లు ఇచ్చే పని రికార్డ్స్ విభాగం డిప్యూటీ తహశీల్దార్ చూసుకుంటారన్నారు. ఈ సంఘటన గురించి తనకు ఏమీ తెలియదని, డిప్యూటీ తహసీల్దార్‌ను సోమవారం అడిగి వివరాలు తీసుకుంటాన్నాడు. ఇదే విషయమై డిప్యూటీ తహసీల్దార్‌కు ఫోన్‌చేస్తే ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

ధ్యానంతో ఆనందమయ జీవనం

కడ్తాల్ , మార్చి 8: ఆనందమయ జీవనానికి, ఒత్తిళ్ల నుంచి ఉపశమనానికి ధ్యానం గొప్ప మార్గమని కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కొర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ అన్నారు. పత్రీజీ చూపిన ధ్యానమార్గాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు, ట్రస్ట్ సభ్యులు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో నిర్మించే ప్రపంచ ధ్యానగురువు దివంగత సుభాష్ పత్రీజీ శక్తిస్థల్ నిర్మాణానికి వారు పత్రీజీ కూతురు పరిణతి, ట్రస్ట్ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పిరమిడ్ ఆవరణలో కొద్దిసేపు ధ్యానులు ధ్యానం చేశారు. దశరథ్, వెంకటేశ్, విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ధ్యాన, శాఖాహార జగత్తే పిరమిడ్ లక్ష్యం అన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తే ఆనందమయ జీవితాన్ని పొందుతారన్నారు. పత్రీజీ మార్గం అందరికీ అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, దామోదర్‌రెడ్డి, శ్రీరామ్‌గోపాల్, చంద్రశేఖర్, రాంబాబు, నీరజారెడ్డి, లక్ష్మి, మాధవి, రమేశ్, రూపస్, పాల్గొన్నారు.



శక్తిస్థల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ, తదితరులు

శివరాత్రి రోజు శివయ్యకు రోడ్డుపైనే భజనలు

- ఆలయం చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో రోడ్డుపై భక్తుల బైఠాయింపు



మెట్లకుంటలో రోడ్డు పై భజన చేస్తున్న గ్రామస్తులు



భక్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

బొంరాస్‌పేట్, మార్చి 8: మహా శివరాత్రి రోజున శివ భక్తులు విధిలేని పరిస్థితుల్లో రోడ్డుపైనే భజనలు, పూజలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే బొంరాస్‌పేట్‌లోని మెట్లకుంట శివారులో ఓ వ్యక్తి పొలంలో శివాలయం ఉంది. తన పొలంలో ఆలయం ఉందని సదరు వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో ఆలయ ఉనికిని కాపాడాలని 2014లో కొడంగల్ మున్సిఫ్‌కోర్టు ఆర్డర్ జారీ చేసింది. ఆ ఆర్డర్‌పై భూ యజమాని హైకోర్టుకు వెళ్లగా హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. మెట్లకుంట వాసులు శుక్రవారం శివరాత్రి పర్వదినాన పూజలు చేసేందుకు ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టు ఫెన్సింగ్ ఉండటంతో మార్గం లేక రోడ్డుపై కూర్చొని భజనలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పరిగి డీఎస్పీ కరుణాసాగర్ అక్కడికి చేరుకొని భక్తులను సముదాయించారు. మీరు కూడా హైకోర్టుకు వెళ్లాలని, కోర్టు ఉత్తర్వులు వచ్చేంత వరకు సంయమనం పాటించాలని భక్తులకు సర్దిచెప్పడంతో గ్రామ స్తులు పూజలు నిర్వహించి వెళ్లిపోయారు.

అరుణాచలం నిత్యాన్నదాన ట్రస్ట్ సంయుక్త కార్యదర్శిగా ఆనంద్



పి.ఆనంద్

షాద్‌నగర్, మార్చి 8 : అరుణాచలేశ్వర స్వామి ఆర్యవైశ్య వాసవి నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ జాయింట్ సెక్రటరీగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త పలబట్ల ఆనంద్ ఎంపికయ్యారు. శుక్రవారం ఆర్యవైశ్య వాసవి నిత్యాన్నదానం సత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఫౌండేషన్ చైర్మన్ ఈ విషయాన్ని ప్రకటించారు. తన నియమాకాన్ని హర్షిస్తూ ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు.

బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మల్లి వెంకటేష్



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేష్

షాబాద్, మార్చి 8: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) చేవెళ్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మల్లి వెంకటేష్‌ను నియమించినట్లు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ మహేంద్రవర్మ తెలిపారు. శుక్రవారం వెంకటేష్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వెంకటేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి జామచంద్రం, నియోజకవర్గ అధ్యక్షుడు చందు, జనరల్ సెక్రటరీ కుమార్, చేవెళ్ల మండల అధ్యక్షుడు రాజు, షాబాద్ మండల సెక్టార్ అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కందుకూరు, మార్చి 8 : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నవతరం యూత్ అధ్యక్షుడు ఎం.మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు టి.కార్తీక్ అన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని బి.భాస్కర్ రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుమన్ నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, సభ్యులు అజీజ్, దీక్షిత్‌రెడ్డి, రాజశేఖర్‌గుప్తా, మల్లేష్, గణేష్, సాయి కుమార్, రాజశేఖర్‌రెడ్డి, మహేందర్, శివ పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలకు బహుమతి అందజేస్తున్న కార్తీక్, ఎం.మహేందర్‌రెడ్డి

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



కాంగ్రెస్ నేత పామెన భీం భరత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

షాబాద్, మార్చి 8 : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీం భరత్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తొంట వెంకటయ్య, గ్రామస్తులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు కృషిచేద్దామన్నారు. పార్టీ కోసం కష్టపడినవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ల పథకాలను ప్రారంభించామని, త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం ప్రారంభిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు టి.రవీందర్, మంగలి చెన్నయ్య, గడ్డం చంద్రయ్య పాల్గొన్నారు.

టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జంగయ్య



రాజు నుంచి నియామకపత్రం అందుకుంటున్న జంగయ్య

షాద్‌నగర్ రూరల్, మార్చి 8 : టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి సోలిపూర్‌నకు చెందిన సింగపాగ జంగయ్య మాదిగ నియమితులయ్యారు. సికింద్రాబాద్‌లోని ఓ హోటల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు ఆయనకు నియామక పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

వైభవంగా మహా శివరాత్రి


వికారాబాద్ : బుగ్గ రామలింగేశ్వరాలయంలో పూజలో పాల్గొన్న ఎస్పీ కోటిరెడ్డి కుటుంబ సభ్యులు


కొడంగల్ రూరల్ : హస్నాబాద్‌లో వీరభద్రేశ్వరస్వామికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు.. ఉపవాస దీక్షలు

వికారాబాద్, మార్చి 8 : మహా శివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఈ సందర్భంగా వికారాబాద్ మునిసిపల్,మండల పరిధిలోని శివాలయాలతో పాటు ఇతర దేవతల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మునిసిపల్ పరిధిలోని బుగ్గ రామలింగేశ్వరాలయం, పులుసుమామిడి పార్వతీ పరమేశ్వరుడి గుట్ట, రామాలయం, మల్లికార్జున ఆలయం, అనంతపద్మనాభ స్వామి దేవాలయాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుగ్గ రామలింగేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఎస్పీ కోటిరెడ్డితో పాటు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

బంట్వారం : బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో శుక్రవారం మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసం ఉన్నవారు సాయంత్రం ఆలయాల్లో ఇష్టదైవాలను దర్శించుకొని దీక్షను విరమించారు.

తాండూరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తాండూరు పట్టణంలోని ప్రజాహిత బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన శివరాత్రి ఉత్సవాలను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు శివరాత్రి రోజు శివ నామస్మరణతో ధ్యానంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్ : అంతారం భూకైలాస్‌లో పూజలు ఘనంగా నిర్వహించారు. శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. అనంతరం ఆలయం నుంచి ప్రారంభమై పల్లకీసేవ తండాలోని పురవీధుల వెంట దేవాలయం చేరుకుంది. ఆల్ ఇండియా బంజారా సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్, భూకైలాస్ వ్యవస్థాపకుడు వాసుపవార్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. భూకైలాస్‌లో మహాశివున్ని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, గోశాల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, డాక్టర్ సంపత్‌కుమార్, డీసీబీ మాజీ సభ్యులు పట్లోళ్ల నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్ తదితరులు దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని వాసుపవార్ నాయక్, శంకర్ పవార్‌లు సన్మానించారు. తాండూరు మండలంలోని అన్ని గ్రామాల్లో మల్లికార్జునస్వామి దేవాలయాలతోపాటు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పరిగి : పరిగి పట్టణం బ్రాహ్మణవాడలోని శివాలయంలో, అనంతరెడ్డినగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రాహ్మణవాడ శివాలయంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు, మాజీమంత్రి సబితారెడ్డి సోదరుడు నర్సింహారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ చిన్నయ్య దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. బసిరెడ్డిపల్లిలోని కృష్ణగిరి క్షేత్రంలో కృష్ణానందస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బహర్‌పేట్ హనుమాన్ దేవాలయం, వేంకటేశ్వరాయం, సాయి ధ్యానమందిరంలో, టీచర్స్‌కాలనీలోని హనుమాన్ దేవాలయం, శ్రీనివాసకాలనీలోని శివాలయం, ప్రశాంతి నిలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలో ప్రధాన దేవాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు కొనసాగాయి. బసిరెడ్డిపలి, కాళ్ళాపూర్, సయ్యద్‌పల్లి, మాదారం, సుల్తాన్‌పూర్, మిట్టకోడూరు, నస్కల్ తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో నిర్వాహకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కులకచర్ల : బండవెల్కిచర్ల పాంబండ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాంబండ రామలింగేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శివమాల ధరించిన శివస్వాములు 41 రోజుల దీక్ష పూర్తి కావడంతో శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలతో ఇరుముడులతో స్వామిదర్శనం కోసం శ్రీశైలానికి బయలుదేరారు. పాంబండ ఆలయంలో అర్చకులు,


దోమ : ఊటుపల్లిలో కొమురవెల్లి మల్లికార్జునస్వామి పల్లకీసేవ నిర్వహిస్తున్న గ్రామస్తులు


పరిగి : ఉపవాస దీక్ష అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దంపతులు, సబితారెడ్డి సోదరుడు నర్సింహారెడ్డి


తాండూరు రూరల్ : పల్లకీసేవలో శంకర్‌నాయక్, భూకైలాస్ వ్యవస్థాపకుడు వాసుపవార్ నాయక్


తాండూరు : జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


కీసర : స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి


కొడంగల్ : గాడిబావి శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పూడూరు : దామగుండం రామలింగేశ్వర స్వామి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు


కులకచర్ల : పాంబండ రామలింగేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు


మూడుచింతలపల్లి : కల్యాణంలో భాగంగా తాళి చూపిస్తున్న అర్చకుడు


మేడ్చల్‌టౌన్ : మేడ్చల్ రామలింగేశ్వరాలయం వద్ద భక్తులు


ఘట్‌కేసర్ రూరల్ : భవాని చంద్ర మౌళీశ్వరాలయంలో ఆశీర్వాదం తీసుకుంటున్న సుధీర్‌రెడ్డి


ఘట్‌కేసర్ : లింగాలకుంటలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


శామీర్‌పేట : భవానీ రామలింగేశ్వరాలయంలో భక్తులు

కులకచర్ల అయ్యప్ప ఆలయంలో గురుస్వాములు చెన్నయ్య, కృష్ణయ్యలు ఇరుముడులు కట్టి పంపించారు.

పూడూరు : పూడూరు మండలం దామగుండం మల్లికార్జునస్వామిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామలింగేశ్వరాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొలనులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. దామగుండం రామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ట్రాఫిక్ చిక్కులు తప్పలేదు. గంటల తరబడి వాహనాలు దారిపొడవునా నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి సిబ్బందితో వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేయడానికి గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది.

బొంరాస్‌పేట్ : దుద్యాల మండలం పోలెపల్లిలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. పోలెపల్లి ఎల్లమ్మ ఆలయం ఆవరణలో వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. దుద్యాల మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల్లోని పలు గ్రామాల్లో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని సంగమేశ్వరాలయం, నాగిరెడ్డిపల్లిలోని పరమేశ్వరాలయాల్లో భక్తులు బారులు తీరారు.

దోమ : ఊటుపల్లి గ్రామంలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. శివస్వాములు, భక్తులు ఉప వాసదీక్షలు చేపట్టి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, మాజీ సర్పంచ్ నర్సింహులు, జంగయ్య, గోపాల్, నాగర్జున, రాజేశ్ రెడ్డి, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్/కొడంగల్ రూరల్/దోమ : కొడంగల్ మండలంలోని హస్నాబాద్‌లో వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు 108బిందెలతో నీటిని తీసుకొచ్చి వీరభద్రేశ్వరుడికి జలాభిషేకం నిర్వహించారు. కొడంగల్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, శివలింగానికి అభిషేకం నిర్వహించారు. కొడంగల్ పట్టణంలోని గాడిబావి శివాలయంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీ యాదవ్, 2వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ కుటుంబసభ్యులు పూజలు చేశారు. దోమ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రజలు ఉపవాస దీక్షలు పాటించి మొక్కులు తీర్చుకున్నారు. దోమ మండల కేంద్రంలోని శివాలయంలో సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి దంపతులు ఉపవాస దీక్షలతో పూజలు నిర్వహించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్ : మహా శివరాత్రి సందర్భంగా మేడ్చల్ ప్రాంతంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మేడ్చల్ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి, ఘనాపూర్‌లోని క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి, రావల్‌కోల్ శివాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

ఘట్‌కేసర్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగాలకుంటలో గల శివలింగంకు, ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం వద్ద గల శివాలయంలో, బాలాజీ నగర్‌లోని శివాలయంలో, శివారెడ్డిగూడలోని దండ్లగడ్డ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలోగల శివాలయంలో, ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని రామాలయం, శివాలయంలో, పోచారంలోని సర్వసంగళా సమేత స్ఫటిక లింగేశ్వరాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, సాయంత్రం దేవాలయాలకు తరలివచ్చి ఉపవాస దీక్షలు విరమించారు.

ఘట్‌కేసర్ రూరల్ : అవుషాపూర్‌లోని ఉమామహేశ్వరాలయం, అంకుషాపూర్‌లోని శ్రీ స్ఫటిక లింగేశ్వరాలయం, ఎదులాబాద్‌లోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయం, ప్రతాప్‌సింగారంలోని భవాని చంద్రమౌళీశ్వరాలయాల్లో సాయంత్రం శివపార్వతుల కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎదులాబాద్‌లో శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తలు కంట్లం చెన్నప్ప, శంకరప్ప, ప్రదీప్, నరేష్, ఓంప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

శామీర్‌పేట : మండలంతో పాటు తూంకుంట మున్సిపల్‌లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రం శామీర్‌పేట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. రాత్రి 8 గంటలకు కల్యాణం నిర్వహించారు. రాత్రి జవహర్ నగర్‌కు చెందిన సదాచారి భజన బృందం భజనలు చేశారు. మండలంలోని తుర్కపల్లి, అలియాబాద్, లాల్‌గడిమలక్‌పేట, పొన్నాల్, బొమ్మరాశిపేట, తూంకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజాల్, తూంకుంటతో పాటు తూంకుంట శ్రీగాయత్రి మహాక్షేత్రంలోని ఉమామహేశ్వర స్వామికి ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్‌వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని జరుపుకున్నారు.

మూడుచింతలపల్లి : లక్ష్మాపూర్‌లో మరకత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో వేదపండితులు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


ధారూరు: శివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


బొంరాస్‌పేట్ : పోలెపల్లిలో శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


ఘట్‌కేసర్ రూరల్ మ: కేక్ కట్‌చేసి మహిళా దినోత్సవం జరుపుకుంటున్న సిబ్బంది, సీఐ సైదులు

మోమిన్‌పేట్/నవాబుపేట, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మోమిన్‌పేట్ మండలంలోని మర్పల్లి, నవాబుపేట, మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులను సీఐ ఆంజనేయులు శాలువాలతో సన్మానించారు. విధి నిర్వాహణలో భాగంగా శక్తి సామర్థ్యం మేరకు ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అరవింద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్ : మహిళలు ఆర్థికంగా రాణించాలని ఘట్‌కేసర్ సీఐ ఎస్ సైదులు తెలిపారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాము నాయక్, శ్రీకాంత్, మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ : మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని లియో సంస్థ సీఈవో దుర్గాపద్మలత అన్నారు. చౌదరిగూడలో గల నల్లనర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్‌లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు/తాండూరు రూరల్ : బీఆర్ఎస్ నియోజకవర్గ మహిళా కన్వీనర్ శకుంతల దేశ్‌పాండే శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు మండలం గౌతాపూర్‌లోని ఆమె నివాసంలో కరన్‌కోట్ ఎస్ఐ-2 విమల, ఎంపీటీసీల సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పటేల్ నరేందర్‌రెడ్డి(సాయిరెడ్డి)తో అపర్ణ ఫుడ్స్ ఆధ్వర్యంలో రాగిపిండి ప్యాకెట్ల విక్రయాలను ప్రారంభించారు. కానిస్టేబుళ్లు శకుంతల, అనిత, పర్వీన్ మహిళలు సద్గుణ, ఉమశ్రీ, మహేశ్వరి, కమలమ్మ, మాణెమ్మ, సావిత్ర, తదితరులున్నారు. అనంతరం ఎస్ఐ విమల, మహిళా కానిస్టేబుళ్లు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు సాయిరెడ్డిని సన్మానించారు. అదేవిధంగా తాండూరులోని ఎస్‌బీఐ(ఏడీబీ) బ్యాంకులో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కేక్ కట్‌చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ మహిళా ఉపాధికి తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. బ్యాంకు ద్వారా మహిళా సంఘాలకు రూ.20లక్షల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన సంఘాలకు స్వయంసిద్ధి కింద రూ.5లక్షల రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

యాలాల : యాలాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను ఎస్ఐ శంకర్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉంటున్నారని అన్నారు.


యాలాల : కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్సై శంకర్


మోమిన్‌పేట : మహిళా పోలీసులను సన్మానించిన సీఐ ఆంజనేయులు

క్రైం కార్నర్

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పరిగి, మార్చి 8 : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మండలంలోని సయ్యద్‌పల్లికి చెందిన పి.సత్తయ్య(36) వృత్తిరీత్యా డ్రైవర్. శుక్రవారం పని నిమిత్తం సయ్యద్‌పల్లి నుంచి చిట్యాల్ వైపు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దాంతో సత్తయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి అంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు మృతి

బైక్‌పై నుంచి కిందపడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఎన్నెపల్లికి చెందిన ఎండీ యూసుఫ్(53) గురువారం పని నిమిత్తం పరిగి మండలం సయ్యద్‌పల్లికి వెళుతున్నాడు. రాఘవాపూర్ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దాంతో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు అజ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

కులకచర్లలో గుర్తుతెలియని వృద్ధురాలు..

కులకచర్ల, మార్చి 8: గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన ఘటన కులకచర్లలో శుక్రవారం చోటుచేసుకుంది. కులకచర్ల ప్రభుత్వాసుపత్రి సమీపంలో 20 రోజులుగా గుర్తుతెలియని వృద్ధురాలు(80) ఓ చెట్టు కింద గూడు వేసుకొని ఉంటోంది. కాగా, ఆమెకు సమీపంలోని ఇళ్లవారు భోజనం పెట్టేవారు. శుక్రవారం సాయంత్రం అటుగా వెళ్లేవారు ఆమెను గమనించగా చలనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు.దాంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అయితే, ఆమె ఎవరు? బంధువులు ఉన్నారా? అనే విషయాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మృతదేహాన్ని పంచాయతీ సిబ్బంది ఖననం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 8 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా భువనగిరిలోని శివనగర్‌కు చెందిన ఆడెపు హేమంత్(24) భార్య శృతి, నాలుగు నెలల చిన్నారితో కలిసి పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని రాజీవ్‌గృహకల్ప బ్లాక్ నెంబర్1, ప్లాట్‌నెంబర్ 12లో నివాసం ఉంటున్నాడు. హేమంత్ నగరంలోని ఓ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. ఈక్రమంలో అతడికి వ్యాపారంలో నష్టం రావడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో పాలుపోలేదు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కూరగాయల మార్కెట్‌కు వెళుతున్నానని చెప్పి.. తిరిగి ఐదు నిమిషాలకే ఇంటికి వచ్చి లోపల నుంచి గడియ వేసుకున్నాడు. భార్య గమనించి పిలిచినా సమాధానం రాలేదు. వెంటనే స్థానికుల సాయంతో తలుపులను బద్దలుకొట్టి చూడగా హేమంత్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా హేమంత్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ఆరేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన..
యువకుడిపై 'పోక్సో కేసు'

ధారూరు, మార్చి 8: ఆరేళ్ల బాలికపై ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించటంతో బాధిత కుటుంబం శుక్రవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దాంతో యువకుడిపై పోక్సో కింద కేసు నమోదు చేశారు. ఎస్సై వేణుగోపాల్‌గౌడ్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(6)ను అదే గ్రామానికి చెందిన జగదీశ్(18) అనే యువకుడు చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తానని చెప్పి శుక్రవారం తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. అనంతరం బాలిక పట్ల అతడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం బాలిక తల్లికి చెప్పడంతో.. ఆమె యువకుడిని, అతడి తల్లిని ప్రశ్నించింది. దాంతో కోపోద్రిక్తులైన వారిద్దరూ ఆమెపై రాయితో దాడిచేశారు. తలకు తీవ్రగాయాలయ్యాయి. అలాగే ఆమెను బూతులు తిట్టారు. ఈమేరకు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ జరిపి యువకుడు జగదీష్‌పై పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కొండగొర్రె మృత్యువాత

ధారూరు, మార్చి 8 : గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో కొండగొర్రె మృతి చెందిన ఘటన ధారూరు సమీపంలోని కత్వ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. డీఎఫ్ఆర్వో జగన్‌మోహన్, ధారూరు బీట్ ఆఫీసర్ నరేష్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కేరెల్లి వైపు నుంచి కొండగొర్రె రోడ్డుపై పరిగెత్తుకుంటూ ధారూరు వైపు వెళ్తోంది. ఈక్రమంలో ధారూరు నుంచి వికారాబాద్ వైపు ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం(బైక్) ధారూరు సమీపంలోని కత్వ వద్ద కొండ గొర్రెను బలంగా ఢీకొంది. దాంతో చాతీ, కాళ్ల భాగంలో బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆనంద్ మృతిచెందిన కొండగొర్రెను పరిశీలించారు. పశువైద్య సిబ్బందితో పోస్టుమార్టం నిర్వహించారు.